

గోవిందుడి కల్యాణం.. చూచిన కనులదే భాగ్యం

మార్కాపురంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణాన్ని శుక్రవారం వేకువజామున వైభవంగా నిర్వహించారు. -10లో..



నేత్రపర్వం.. రఘునాయకుడి పరిణయం

చదలవాడలో రఘునాయకుని కల్యాణాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొని పరవశించిపోయారు. -10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34 /27

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికం. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.



కర్షకుని యంత్రసేవ

రైతన్నలకు సకలం సమకూరుస్తూ వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా మరింత చేయూతనిస్తోంది. అన్నదాతలతో గ్రూపులు ఏర్పాటు చేయించి ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తోంది. వ్యవసాయంలోనూ టెక్నాలజీని పరుగులు పెట్టిస్తోంది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 200 రైతు గ్రూపులు ఏర్పాటు చేయగా, 78 యూనిట్లకు గ్రౌండింగ్ పూర్తయింది. 32 గ్రూపులకు యంత్ర పరికరాలు అందజేశారు.



- ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 200 రైతు గ్రూపులు ఏర్పాటు
- ఇప్పటికే 78 యూనిట్లు గ్రౌండింగ్
- 32 రైతు గ్రూపులకు యంత్ర పరికరాల అందజేత
- అన్నదాతకు వరంగా మారిన వైఎస్సార్ యంత్ర సేవా పథకం

మార్కాపురం: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు అత్యాధునిక యంత్ర పరికరాలు అందజేయడం ద్వారా వ్యవసాయ కూలీల కొరతను అధిగమించనుంది. రైతులు తక్కువ ఖర్చుతో మంచి పంట దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించే దిశగా అడుగులు వేస్తోంది. అందుకోసం వ్యవసాయ శాఖ ద్వారా వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం రైతుల పాలిట వరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అన్నదాతలందరికీ ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు వ్యవసాయ శాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 200 రైతు గ్రూపులు ఏర్పాటు చేశారు.

పథకం అమలు ఇలా...

జిల్లా వ్యవసాయ శాఖ పరిధిలో మార్కాపురం, వై.పాలెం, ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, దర్శి, సింగరాయకొండ సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 36 మండలాలున్నాయి. ప్రతి ఆర్‌బీకే పరిధిని ఒక యూనిట్‌గా చేసుకుని ఐదుగురు రైతులతో ఒక క్లస్టర్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. రూ.15 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను ఆ గ్రూప్‌నకు అందిస్తారు. అందులో 40 శాతం సబ్సిడీగానీ, లేదా ప్రభుత్వం నిర్ణయించిన పరిమితికి లోబడి రాయితీగానీ రైతులకు అందిస్తారు. మిగిలిన రుణాన్ని బ్యాంక్‌ల ద్వారా రైతులకు అందించే ఏర్పాట్లు చేస్తారు. రైతుల వాటాగా 10 శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

రైతులకు అందించే వ్యవసాయ పనిముట్లు...

రైతులకు పెద్ద ట్రాక్టర్లు, ట్రక్కులు, నూర్పిడి యంత్రాలు, రొటోవేటర్లు, నాగళ్లు, గొర్లు, గుంటక బేడ్లు, విత్తనపు గొర్లు, ట్రాక్టర్ ద్వారా పిచికారీ చేసే యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, కల్లాల్లో కప్పుకునే తెలుపు, నీలి పట్టలు, తెల్ల పైపులు అందిస్తారు. ఈ క్లస్టర్ గ్రూపు నిర్వాహకులు రైతులకు అతి తక్కువకే వాటిని అద్దెకు పంపిస్తారు. సాధారణంగా బయట ట్రాక్టర్ ద్వారా ఎకరా పొలం దున్నాలంటే రూ.1,200 నుంచి రూ.1,500 తీసుకుంటారు. క్లస్టర్ గ్రూప్ ద్వారా అయితే మండల వ్యవసాయ సలహా మండలి నిర్ణయించిన అతి తక్కువ అద్దెకే పొలం దున్నేందుకు ట్రాక్టర్ పంపిస్తారు.

వ్యవసాయ సబ్ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన గ్రూప్‌లు...

సబ్ డివిజన్	రైతు గ్రూప్‌లు
మార్కాపురం	24
దర్శి	31
గిద్దలూరు	22
కనిగిరి	29
ఒంగోలు	47
సింగరాయకొండ	15
వై.పాలెం	32

మాలాంటి రైతులకు చాలా ఉపయోగం



వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో ఇస్తున్న పనిముట్లు మాలాంటి రైతులకు చాలా ఉపయోగపడుతున్నాయి. బయట అద్దెల కంటే రైతు గ్రూపుల దగ్గర అవసరమైన పనిముట్లను అతి తక్కువ అద్దెకు తీసుకెళ్తున్నాం.

– జే ఆవులయ్య, రైతు

రైతులు ఉపయోగించుకోవాలి



వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని రైతులు చక్కగా ఉపయోగించుకోవాలి. ప్రతి ఆర్‌బీకే పరిధిలో ఒక క్లస్టర్ గ్రూప్‌నకు ఈ పథకం ద్వారా వ్యవసాయ పరికరాలు అందిస్తున్నాం. అద్దెలు కూడా రైతు భరోసా కేంద్రాల్లో డిస్‌ప్లే చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

న్యూస్‌రీల్

12న సీఎం జగన్ మార్కాపురం రాక

- ఈబీసీ నేస్తం ప్రారంభం
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు, పోలీసులు

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం పట్టణానికి వస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం విలేకర్లకు తెలిపారు. సీఎం సభ ప్రాంగణం, హెలీప్యాడ్ కోసం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణాలతో పాటు మరికొన్ని ప్రాంతాలను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పట్టణ నాయకుడు ఇస్మాయిల్, ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, సీఐ భీమానాయక్, ఎస్సైలు సుమన్, శశికుమార్‌తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే కేపీ పరిశీలించారు.

మనందరి నమ్మకం జగనన్నే



'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- నగరంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభం
- ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు చదివి వినిపించిన బాలినేని
- ఇంటింటికి, ఫోన్లకు స్టిక్కర్ అంటించిన వైనం
- 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

ఒంగోలు సబర్బన్: ప్రజలందరి నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా ప్రవేశపెట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం ఒంగోలు నగరంలోని గద్దలగుంటలో బాలినేని లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక 32వ డివిజన్‌లో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోనే 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సీపీ ప్రత్యేకంగా రూపొందించిన బ్యాగు తగిలించుకున్న బాలినేని.. ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన సందేశాన్ని స్వయంగా చదివి ప్రజలకు వినిపించారు. గద్దలగుంటలోని ప్రతి గడపకు మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను బాలినేని అంటించారు. ఆ ఇళ్లలోని మహిళల సెల్‌ఫోన్ల వెనుకవైపు 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్ అంటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ నాలుగేళ్లలో ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందంటూ స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన స్లిప్పులో ఆ వివరాలు నమోదు చేసి ఆ రసీదులను స్థానికులకు అందజేశారు. గద్దలగుంటలోని ఓగిరాలవారివీధిలో నివాసం ఉంటున్న ఓగిరాల లక్ష్మీదుర్గకు మొదటి రసీదును బాలినేని అందజేసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక మహిళలు బాలినేనికి హారతులు, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా మహిళలు, రైతులను ఏ విధంగా మోసం చేశారనే విషయాన్ని బాలినేనికి స్వయంగా మహిళలు వివరించారు. జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి మొదలుకుని ప్రతి ఇంటికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలతతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను బాలినేని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, పార్టీ నాయకులు గోలి తిరుపతిరావు, గంటా రామానాయుడు, కఠారి శంకర్, రాయపాటి అంకయ్య, కొమ్మూరి రవిచంద్ర, కార్పొరేటర్లు గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, ఈదర సురేష్ బాబు, చల్లా తిరుమలరావు, చింతపల్లి గోపీచంద్, శ్రీరాం నాగభూషణం, నాగం వెంకట శేషయ్య, ట్రేడ్ యూనియన్ నాయకుడు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, జాజుల కృష్ణ, నాయకులు చావల శ్రీనివాసరావు, చింతగుంట్ల సువర్ణ, బొమ్మినేని మురళి, తూము పద్మ, మీరావలి, 32వ డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, చిట్టెం సురేష్, మన్నేపల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల భీమేష్, గాజుల సాయి, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి వెంకటేష్, గరికపాటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

- రెండు వారాలపాటు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రతి గడపలోనూ పలకరింపు
- ప్రభుత్వ పథకాలపై 5 ప్రశ్నల ద్వారా సమాధానాల సేకరణ
- రాష్ట్రంలో 87 శాతం మందికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం.. జగనన్న ప్రభుత్వం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సీఎం సందేశంతో కూడిన వీడియోను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, జంకె వెంకటరెడ్డి, ఆదిశేషగిరిరావు, మేయర్

ఒంగోలు: ప్రభుత్వం పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతిఒక్కరికీ తెలియజేయడమే లక్ష్యంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని స్థానిక గద్దలగుంటలో ప్రారంభించామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తారన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి ఐదు ప్రశ్నల ద్వారా సమాధానాలు రాబడతారన్నారు. అనంతరం ఆ ఇంటికి జగనన్న ఫొటోతో కూడిన స్టిక్కర్ అంటించడం జరుగుతుందన్నారు. అదే విధంగా జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన బుక్‌లెట్ అందిస్తారని తెలిపారు. సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటారని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి గద్దలగుంటలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రజలు హారతులు పట్టి మరీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే మన రాష్ట్రం బాగుంటుందనే మాటలు ప్రతి గడపలోనూ వినిపిస్తున్నాయని బాలినేని అన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి...

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అమలుచేసిన పథకాలతో ప్రతి కుటుంబానికి కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఆర్థికంగా లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రతి గడపలోనూ ప్రతి ఒక్కరినీ కలిసి వారికి పథకాల గురించి వివరించడం ద్వారా జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. దేశంలోని ఇతర సీఎంలు, దేశ ప్రధాని నరేంద్రమోదీ, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు సైతం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రశంసలు అందిస్తున్నారన్నారు. నేను మేలు చేశానని భావిస్తేనే ఓటేయండి అంటూ సగర్వంగా ప్రజలను కోరిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, అటువంటి నాయకుడు మనకు సీఎం కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావిస్తూ పేద ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్నారన్నారు. 2024లోనూ జగన్‌ను సీఎంగా గెలిపించుకుందామని జంకె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన వీడియోను బాలినేని, జంకె విడుదల చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు ఆదిశేషగిరిరావు, ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల గృహాల సందర్శన

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల గృహాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు సందర్శిస్తాయని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇంతవరకూ ఏ పార్టీ చేయని కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్న తీరుతెన్నులను పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్యవేక్షిస్తారన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్న దృష్ట్యా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు వైనాట్ 175 కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లాతో పాటు తాను పర్యవేక్షిస్తున్న మూడు జిల్లాల్లోనూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

ఆస్తి కోసం చెల్లిని హత్య చేయించిన అన్న

- కనిగిరిలో మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- విజయవాడకు చెందిన కిరాయి హంతకులు అరెస్టు
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికాగర్గ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: కష్టసుఖాల్లో చెల్లికి అండగా నిలబడి కొండంత ధైర్యాన్ని ఇవ్వాల్సిన అన్న.. ఆస్తి కోసం రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలినే అత్యంత దారుణంగా హత్య చేయించాడు. ఇటీవల కనిగిరిలో జరిగిన ఈ హత్య కేసును పోలీసులు ఛేదించడంతో విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. హంతకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్ ఆ వివరాలు వెల్లడించారు. కనిగిరికి చెందిన ఓలేటి సుశీల, కొలిపర్తి శ్రీనివాసులు అన్నాచెల్లెళ్లు. మేనమామతో వివాహమైన కొద్దిరోజులకే అతనితో సుశీలకు మనస్పర్థలు రావడంతో తల్లితో కలిసి కనిగిరిలోని కొత్తపేట కాశీనాయన గుడిరోడ్డులో నివాసం ఉంటోంది. శ్రీనివాసులు మూడు పెళ్లిళ్లు చేసుకున్నప్పటికీ భార్యలకు దూరంగా ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు పాల వ్యాపారం చేసుకుంటూ ఒంటరిగా నివసిస్తున్నాడు. వ్యాపారాల్లో నష్టపోయిన అతను.. రూ.50 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. ఆ అప్పులు తీర్చడానికి తన తల్లి పేరుపై ఉన్న ఆస్తుల మీద కన్నేశాడు. అయితే, చెల్లెలు సుశీల ఆ ఆస్తులకు తన పేరు మీద వీలునామా రాయించుకుంది. ఆ ఆస్తులను తనకు ఇవ్వమని సుశీల మీద ఒత్తిడి చేసినప్పటికీ ఆమె తిరస్కరించింది. దీంతో ఆమె మీద కక్ష పెంచుకున్న శ్రీనివాసులు.. తన స్నేహితురాలైన కనిగిరి పట్టణానికి చెందిన బత్తుల లలితతో కలిసి చెల్లెలిని హతమార్చాలని కుట్రపన్నాడు. లలితకు పరిచయస్తుడైన విజయవాడకు చెందిన కరిముల్లా బేగ్‌తో రూ.10 లక్షలకు హత్య చేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. కరిముల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు పంచాయితీలు చేస్తుంటాడు. బాలుడితో కలిసి ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతుంటాడు. అతడికి మూడు దఫాలుగా రూ.1.10 లక్షలను శ్రీనివాసులు చెల్లించాడు.

అద్దెకు దిగి ప్లాన్...

సుశీల నివాసం పైఅంతస్తు ఖాళీగా ఉండటంతో అందులో అద్దెకు దిగి హత్య చేయాలని ప్లాన్ చేశారు. ఆ ప్రయత్నం విఫలమవడంతో ప్లాన్ మార్చి కరిముల్లా బేగ్ స్వయంగా రంగంలోకి దిగాడు. ఈ నెల 4వ తేదీ బాలుడితో కలిసి కారులో కనిగిరి బయలుదేరాడు. మార్గం మధ్యలో దర్శిలో రెండు కత్తులు, ఒక సుత్తి కొనుగోలు చేశారు. నేరుగా కనిగిరిలోని సుశీల ఇంటి వద్దకు చేరుకుని ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. ఇల్లు చూపించడానికి పైఅంతస్తుకు వెళ్లిన సుశీలపై దాడి చేశారు. గొంతు కోసి తలపై సుత్తితో మోది హత్య చేసి పారిపోయారు. ఈ కేసులో నిందితులు కొలిపర్తి శ్రీనివాసులు, కరిముల్లా బేగ్, బత్తుల లలిత, మరో బాలుడిని కనిగిరిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన మూడు రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. విలేకరుల సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నాయకుడు.. జగనన్న

- రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం మెచ్చిన నాయకుడని, ఆ ధైర్యంతోనే తాము ప్రజా మద్దతు కూడగట్టుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లగలుగుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. యర్రగొండపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదాన్ని ప్రధానంగా తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేశామని ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. వారి అనుమతితో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, జగనన్నకు మద్దతు తెలుపుతున్నారనే విధంగా ఒక స్టిక్కర్‌ను ఇళ్లకు అతికించడం జరుగుతుందని వెల్లడించారు. వ్యక్తిగతంగా కూడా వారు మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో, విశ్వాసంతో ఉంటే వారి మొబైల్ వెనుకవైపు కూడా ఒక స్టిక్కర్ అతికించడం జరుగుతుందన్నారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు పచ్చనేతల చేతుల్లో ఉండేవని, పేదలు వారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. కొన్ని సామాజిక వర్గాలకు మాత్రమే పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వారు ఏ పార్టీకి ఓటు వేశారనేది కాకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకుని పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు.

వై.పాలెం 3వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి...

యర్రగొండపాలెంలోని 3వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఆ గృహ యజమానితో మాట్లాడారు. సంక్షేమ పథకాలు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి మహిళలు హారతులు పట్టారు. పూల వర్షం కురిపించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను స్వయంగా వారి గృహాలకు మంత్రి అతికించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, మందా లాజర్, కోట్ల సుబ్బారెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషు, పార్టీ మండలాల అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, డి.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, జి.రమణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్లు సయ్యద్ జబీవుల్లా, వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మజీద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఐ.వి.సుబ్బారావు, కందూరి కాశీనాథ్, యక్కలి భాగ్యరావు, మొగళి సుబ్బారావు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య, పుల్లలచెరువు మండల జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువపై ఏసుక్రీస్తు ప్రదర్శనలు నిర్వహించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- సాక్షి, ఒంగోలు



ఒంగోలులోని పునీత చినథెరేసమ్మ చర్చి ఆధ్వర్యంలో శిలువపై క్రీస్తు



జేఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేత్రపర్వం.. రఘునాయకుడి పరిణయం


కళ్యాణ మండపంపై దేవేరులతో రఘునాయకస్వామి


స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్

నాగులుప్పలపాడు: చదలవాడ రఘునాయకుని కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామాన్ని స్మరిస్తుండగా.. వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 11.13 గంటలకు గరుడ పక్షి రాకతో స్వామి వారి పరిణయ క్రతువు వైభవోపేతంగా సాగింది. పెనుబోతు వారి కుటుంబంతో కలిసి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జిల్లా జడ్జి ఎ.భారతి, ఎంపీపీ నలమలపు అంజమ్మ, కృష్ణారెడ్డి దంపతులు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పోలవరపు శ్రీమన్నారాయణ, పెనుబోతు రంగారావు దంపతులు, సర్పంచ్ వరప్రసాదరావు, ఆలయ ట్రస్టీ వెంకట నరసింహాచార్యులు, ఈఓ అనిల్‌కుమార్ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం రథోత్సవం కనుల పండువగా సాగింది.


కళ్యాణాన్ని తిలకించేందుకు హాజరైన భక్తులు


కళ్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి


కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గోవిందుడి కళ్యాణం.. చూచిన కనులదే భాగ్యం

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, జంకె

మార్కాపురం టౌన్: వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలు, సుమంగళ వాయిద్యాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజామున దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన స్వామి వారి కళ్యాణాన్ని ఆద్యంతం తిలకించి భక్తులు పులకించారు. గురువారం రాత్రి సూర్య వాహనంపై పెళ్లి కుమారుడిగా చెన్నకేశవస్వామి వారు భేరి మండపానికి చేరుకోగా అర్చకుల పూజల అనంతరం రాయబారం, ఎదుర్కోలు ఘట్టాలను వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పసిడి, రజత ఆభరణాలు, రంగు రంగుల పుష్పాలతో అందంగా అలంకరించి కళ్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. ఆనవాయితీ ప్రకారం వేములకోటకు చెందిన ఆమంచి చంద్రశేఖర్, మోహన్ స్వామివారికి తలంబ్రాలు, బియ్యం, తాళిబొట్లు, కంకణం, భటువు, కళ్యాణ వస్త్రాలు సమర్పించారు. శ్రీపతి అప్పనచార్యులు, యాజ్ఞీకులు సోమయాజుల మల్లికార్జునశర్మ వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ గోవిందుడి కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. వాఖ్యాతగా అనంత కుమారాచార్యులు వ్యవహరించారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది.

పట్టువస్త్రాలు సమర్పించిన ప్రముఖులు

మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, డీఎస్పీ కిషోర్‌కుమార్, చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, ఈఓ జి.శ్రీనివాసరెడ్డి దంపతులతోపాటు ధర్మకర్తలు పట్టువస్త్రాలు సమర్పించారు. సూర్య వాహనం ఉభయదాతలుగా తంగిరాల నాగజగన్నాథ్, కిషోర్, మేడా బద్రి, ఎస్ఎస్ కళాశాల చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ధర్మకర్త అర్జునరావు, డాక్టర్ కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి, పలువురు పుర ప్రముఖులు, అధికారులు పాల్గొని స్వామి వారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారికి ముత్యాల తలంబ్రాలను నాదెళ్ల సుబ్రహ్మణ్యం, ఏపీ వెంకటేశ్వర్లు, మేడా దంపతులు సమర్పించారు. భద్రత ఏర్పాట్లను పట్టణ పోలీసులు, వలంటీర్లు పర్యవేక్షించారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ కుటుంబ సభ్యులు


జంకె దంపతులు

రమణీయం.. రంగనాయకుడి కళ్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పట్టువస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు దంపతులు


రంగనాయకస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రాచర్ల: నెమలిగుండ్ల రంగరాయక స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం వేదమంత్రాల సాక్షిగా, మంగళ వాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకస్వామి కళ్యాణం రమణీయంగా నిర్వహించారు. జేపీ చెరువు సమీపంలోని నల్లమల అభయారణ్యంలో రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణం వేలాది మంది భక్తుల శరణుఘోషతో మారుమోగింది. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు.. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంపై ప్రతిష్టించారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, దుర్గాకుమారి దంపతులు, దేవస్థానం చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి వారి కల్యాణంలో గిద్దలూరు డీఎఫ్ఓ వై.నరసింహారావు, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కుమారుడు అన్నా కృష్ణచైతన్య దంపతులతోపాటు 40 మంది ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజల అనంతరం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, అన్నవరం సత్యనారయణచార్యులు, భూమరాజు సాయి వంశీ బృందం రంగనాయకస్వామి కళ్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు గిద్దలూరు నియోజకవర్గంతోపాటు ఒంగోలు, కర్నూలు, విజయవాడ, నంద్యాల, మార్కాపురం తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వివిధ సామాజికవర్గాల సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పర్యవేక్షించారు. గిద్దలూరు సీఐ ఎస్ఎండీ ఫిరోజ్ ఆధ్వర్యంలో రాచర్ల, బేస్తవారిపేట, కంభం, గిద్దలూరు ఎస్సైలు వి.మహేష్, కే.మాధవరావు, నాగమల్లేశ్వరరావు, రజిత, బ్రహ్మనాయుడు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తాం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి
- చీమకుర్తిలో 'మా నమ్మకం నువ్వే జగన్' ప్రారంభం


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడిచిన నాలుగేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తి మున్సిపాలిటీలో నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి సంబంధించిన స్టిక్కర్లను స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి అంటించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాలు అందించడంతోపాటు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులు, రోడ్లను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన వారు వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా ఎన్ఎస్‌పీ కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. తొలుత బూచేపల్లి నివాసానికి మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను అంటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గోగినేని వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నలమల మాణిక్యం, వైస్ ఎంపీపీ జ్యేష్ఠ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలడుగు సుబ్బారావు, మంచా హరికృష్ణ, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

- తాలూకా పోలీసు స్టేషన్ సమీపంలో ఘటన

ఒంగోలు టౌన్: జనం హడావుడిగా తిరుగుతున్న సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడటం సంచలనం సృష్టించింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాలు.. గుర్తు తెలియని యువకుడు ఉదయం 6.40 గంటల సమయంలో నడుచుకుంటూ తాలుకా పోలీసు స్టేషన్ మీదుగా సుజాత నగర్ వైపు వెళ్లాడు. తిరిగి 8 గంటల సమయంలో పోలీసు స్టేషన్ వద్దకు వచ్చి పోలీసు కళ్యాణ మండపం దగ్గర చెట్టు కింద నిల్చుని తనలో తాను మాట్లాడుకుంటూ ఉన్నాడు. అయితే ఆఫీసులు, కళాశాలలకు వెళ్లే హడావుడిలో ఉన్న జనం ఆ యువకుడిని పట్టించుకోలేదు. ఇంతలోనే స్టేషన్‌కు కొద్ది దూరంలో ఫెన్సింగ్‌కు ఆనుకుని ఉన్న చెట్టుకు ఆ యువకుడు ఉరి వేసుకున్నాడు. మృతుడి వయసు సమారుగా 28 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుడి చేతి మీద అమ్మ అని, ఎడమ చేయి మీద ఎస్.రవి, నాగ మల్లిక అని, చాతిపై మల్లికా అని పచ్చబొట్లు ఉన్నాయి. జేబులో గురువారం రాత్రి నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్దగల మెడికల్ షాపులో నొప్పి మందులు కొనుగోలు చేసినట్లు రశీదు ఉంది. మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.